క్లుప్తంగా

నేడు తలకొండపల్లిలో ఆచారి పర్యటన

తలకొండపల్లి: బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారి మంగళవారం మండలంలో పర్యటించనున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవిగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణశక్తికేంద్ర అభియాన్‌లో భాగంగా ఇంటింటికి బీజేపీలో నేతల పనితీరు, ముమ్ముందు చేపట్టాల్సిన కార్యచరణపై నేతలకు, కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నారు. అలాగే ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటింటికి బీజేపీలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తారు. మండల నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు బీజేపీ ధర్నా

ఆమనగల్లు: పెంచిన ఇంటిపన్నును తగ్గించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీగా ఉన్న ఆమనగల్లుని మున్సిపాలిటీగా చేసినవరకు బాగానే ఉన్నా పన్నులను ఇష్టారీతిగా పెంచేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపాలిటీ కావడంతో ఎన్ఆర్ఈజీఎస్ పనులు కూడా జరగడం లేదని చెప్పారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో ఇంటిపన్నులను ఏకపక్షంగా దాదాపు 10 రెట్లు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పన్నులను తగ్గించాలనే డిమాండ్‌తో నిర్వహించే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీఐలకు సన్మానం



సీఐలు ఉపేందర్, వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

ఆమనగల్లు: ఆమనగల్లు సీఐగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న సీఐ ఉపేందర్, ఆమనగల్లుకు నూతనంగా వచ్చిన సీఐ వెంకటేశ్వర్లును సోమవారం తలకొండపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్, నాయకులు రమేశ్‌నాయక్, దేరంగుల వెంకటేశ్, గణేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్, కోశాధికారి వెంకటయ్య, పీఆర్‌ఓ పాషా, సభ్యులు రమేశ్, రాములు, సుధీర్‌రెడ్డి, బాలకృష్ణ, రామ్మోహన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాత కృష్ణ

మంచాల: మండల పరిధిలోని చిత్తాపూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు సోమవారం దాత ఉయ్యాల కృష్ణ ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డు నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు ముంతాజ్ బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మంచాల మహిళా అధ్యక్షురాలిగా శిల్ప

మంచాల: మంచాల మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా కాగజ్‌ఘాట్ గ్రామానికి చెందిన బాకారం శిల్ప నియామకమయ్యారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ఆమె నియామక పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, జిల్లా నాయకుడు గురునాథ్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు వాజిద్, నాయకులు.. రాజు, రవి, జంగయ్య, అంజయ్య, రాఘవరెడ్డి, ప్రభు, కుమార్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్ట్

హయత్‌నగర్: ట్రావెల్స్ బస్సులో గంజాయిని తరలిస్తున్న ఓ మహిళను సోమవారం హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ లక్ష్మణ్‌గౌడ్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర కళ్యాణ్‌కు చెందిన అఖ్తరి ఇసాక్ మన్సూరి(51) వైజాగ్ నుంచి కళ్యాణ్‌కు గంజాయిని తీసుకెళ్లి అక్కడ విక్రయిస్తుంది. సోమవారం రామోజీ ఫిలింసిటీ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు ఓ ప్రైవేటు వాహనంలో ఆరు (ఒక్కొక్కటి 2 కిలోలు) గంజాయి ప్యాకెట్లు బయట పడ్డాయి. సదరు మహిళను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాల సరఫరాను అరికడతామన్నారు. యువత చెడువ్యసనాలకు బానిస కావొద్దన్నారు.

వేతనాలు పెంచేవరకు పోరాటం



యాచారం: సమ్మె నోటీసు ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



ఇబ్రహీంపట్నం: మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి స్వప్న

- సమ్మెకు దిగిన మధ్యాహ్న భోజన కార్మికులు
- 12న కలెక్టరేట్ ముట్టడిస్తామని వెల్లడి

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి స్వప్న డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన మూడు రోజుల సమ్మెలో భాగంగా సోమవారం (మొదటిరోజు) ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ఆమె నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజనం కార్మికుల వేతనాలు పెంచుతామంటూ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చెప్పి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. భోజన బిల్లులు కూడా సక్రమంగా చెల్లించడంలేదని, పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లేశ్, కృష్ణ, కార్మికులు.. పుష్పమ్మ, సుగుణమ్మ, శిరీష, సరిత, కల్పన పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు హయత్‌నగర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ నాయకులు నర్సింహ మాట్లాడుతూ... కార్మికులకు కనీస వేతనం రూ.3వేలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ మాటను నిలబెట్టుకోలేదని అన్నారు. దీనికితోడు కొన్ని నెలలుగా వంటలకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులు సత్యనారాయణ, కనకయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో మధ్యాహ్న భోజనం బంద్..

యాచారం: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే సిబ్బంది సోమవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు. మధ్యాహ్నం భోజన బిల్లులు ఆరునెలలు దాటినా రావడం లేదని, నెలకు అందజేసే రూ.వెయ్యి జీతం సరిపోవడం లేదని, అప్పులు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండి పెడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నెలకు రూ. 5వేల జీతం ఇవ్వడంతో పాటు ప్రతీనెల బిల్లులు క్లియర్ చేయాలని.. సరుకులు, కూరగాయల ధరలు పెరిగినట్లుగానే చెల్లించే రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా ఈనెల 11, 12 తేదీల్లో మధ్యాహ్న భోజనాన్ని వండటం బంద్ చేస్తున్నామని తెలిపారు. 12న కలెక్టరేట్ ముట్టడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్, భోజన కార్మికులు.. నరేందర్, సువర్ణ, కళావతి, పద్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఇర్విన్ మండలంలో కలపొద్దు

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆర్కపల్లి గ్రామస్తుల నిరసన

ఆమనగల్లు: ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసే ఇర్విన్ మండలంలో ఆర్కపల్లి గ్రామాన్ని కలపరాదని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల మాడుగుల మండలంలోని ఇర్విన్ గ్రామాన్ని మండల కేంద్రంగా గుర్తిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇర్విన్‌లో చేర్చిన పలు గ్రామాల ప్రజలు తమ గ్రామాలను మాడ్గుల మండలంలోనే ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. మండల పరిధిలోని ఆర్కపల్లి, పల్గుతండా, అన్నెబోయినపల్లి, సుద్దపల్లి, కొత్త బ్రాహ్మణపల్లి గ్రామలను ఇర్విన్‌లో కలపవద్దంటూ ఆయా గ్రామాల ప్రజలు సోమవారం మాడ్గుల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తమ గ్రామాలను ఇర్విన్‌లో కలపడంతో ఇబ్బందులు పడుతామని వారు అన్నారు. ఆయా గ్రామాల నుంచి ప్రజలు నల్లజెండాలతో ర్యాలీగా ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీఓ రాఘవులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కళ, జోజమ్మ, నాయకులు యాదయ్య, బాల్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, కిషన్‌నాయక్, రమేశ్‌నాయక్, మాడుగుల మండల పరిరక్షణ కమిటీ సభ్యులు రమేశ్‌గౌడ్, గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. ఇర్విన్‌లో జర్పుల తండాను కలపడాన్ని నిరసిస్తూ జర్పుల తండా వార్డు సభ్యులు నేనావత్ పాండు ఎంపీడీఓ రాఘవులుకు తన రాజీనామా పత్రం అందించారు. అలాగే పల్గుతండాను ఇర్విన్ మండలంలో కలపడాన్ని నిరసిస్తూ పల్గుతండాకు చెందిన ఐదుగురు వార్డు సభ్యులు రాజీనామా చేశారు.



మాడ్గుల ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేత్రదానంపై అపోహలు వీడండి



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లుగౌడ్

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్

ఆమనగల్లు: నేత్రదానంపై అపోహలు వీడి.. ప్రతిఒక్కరూ నేత్రదానం చేసి మరో ఇద్దరికి చూపు ప్రసాదించాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో కంటి వైద్యులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 66 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 34 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు జూలూరి రమేశ్, నటరాజ్ యాదయ్య, లయన్స్ క్లబ్ కోశాధికారి వెంకటయ్య, పీఆర్ఓ పాషా, సభ్యులు రాములు, సుధీర్‌రెడ్డి, రాంరెడ్డి, వీరబొమ్మ రామ్మోహన్, కొట్ర మల్లేశ్, ఎంగలి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు స్పందించకపోవడంతో..

చందాలు వేసుకొని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కాలనీవాసులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీలోని 9వ వార్డు పరిధిలో ఉన్న వెంకటగిరి కాలనీవాసులు చందాలు పోగుచేసి రూ.2 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. వెంకటగిరి కాలనీలో మురుగు కాలువ లేక ఇబ్బందులు పడుతున్నామని.. మురుగు కాలువ నిర్మించాలని గతంలో మున్సిపల్ చైర్మన్, పాలకవర్గానికి, కమిషనర్‌కు కాలనీవాసులు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. వారు పట్టించుకోకపోవడంతో కాలనీవాసులే చందాలు వేసుకొని సోమవారం కాలనీలో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కొండారెడ్డి, యాదయ్య, నాగరాజు, కుమార్, సైదులుగౌడ్, వెంకటయ్య, రాజు, శ్రీను, యాదయ్య, లక్ష్మణ్‌నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

'నల్లాలబావిని కాపాడండి'

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని తొర్రూర్ రోడ్డులో ఉన్న నల్లాలబావి, మోటార్‌ను.. స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు సోమవారం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీకి ఫిర్యాదు చేశారు. స్థానికుల నుంచి ఫిర్యాదు అందుకున్న కమిషనర్ నల్లాల బావిని పరిశీలించారు. ఎన్నో ఏళ్ల నుంచి గ్రామ పంచాయతీ ఆధీనంలోనే ఉన్న ఈ బావిని గ్రామస్తులు వినియోగించే వారని.. మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ భూమిలో కొందరు అక్రమంగా నిర్మాణాలు కూడా చేపట్టారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు స్పందించి నిర్మాణాలను తొలగించడంతో పాటు భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారానికి 8వ రోజుకు చేరుకున్నాయి. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు కోరారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన బాదేపల్లి జంగయ్యగౌడ్ (48) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ దాసరి కిష్టమ్మ, మాజీ ఎంపీటీసీ యాదయ్య మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ అందజేసిన రూ.3000, సర్పంచ్ వ్యక్తిగతంగా రూ.1000.. మొత్తం రూ.4000 బాధిత కుటుంబానికి అందజేశారు.

రైతులకు పట్టా పాసు పుస్తకాలు ఇవ్వండి: సీపీఎం

మంచాల: రాచకొండ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 273లో సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపూరం తహసీల్దార్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మంచాల మండలంలోని తిప్పాయిగూడ, ఆరుట్ల గ్రామాలకు చెందిన రైతులు రాచకొండ రెవెన్యూ పరిధిలో తాతలకాలం నుంచి భూములను సాగు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు పాసుపుస్తకాలు ఇవ్వడమే గాకుండా బ్యాంకు నుంచి రుణాలు కూడా అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టా పాసు పుస్తకాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పట్టా పాసు పుస్తకాలు అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యాదయ్య, నాయకులు జంగయ్య, బుగ్గరాములు, రవి, యాదయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్



భిక్షాటన చేస్తున్న డీవైఎఫ్ఐ నేతలు

ఇబ్రహీంపట్నం: నిత్యావరాల ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్ మండిపడ్డారు. ఇబ్రహీంపట్నంలోని కూరగాయల మార్కెట్లో ధరల పెరుగుదలకు నిరసనగా సోమవారం డీవైఎఫ్ఐ నాయకులతో కలిసి ఆయన భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో సతమతమౌతుంటే.. కూరగాయల ధరలు కూడా ఆకాశానంటడంతో సామాన్యులు విలవిలలాడుతున్నారన్నారు. రైతుల వద్ద కూరగాయలను తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్న దళారులు ఇష్టానుసారంగా ధరలను పెంచి విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. రైతుబజార్లలో తక్కువ ధరకే కూరగాయలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు.. రమేష్, సాయి, యాదగిరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి వాకీటాకీల అందజేత



సిబ్బందికి వాకీటాకీలు అందజేసిన సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: గ్రామ పంచాయతీలో అందించే సేవల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కడ్తాల్ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన పాలకమండలి సభ్యులు సమావేశమై.. గ్రామంలోని సమస్యలపై చర్చించారు. పంచాయతీ పరిధిలో పనిచేసే సిబ్బందికి 'వాకీటాకీ'లను అందించనున్నట్లు తెలిపారు. వాటి సహాయంతో గ్రామంలో ఎక్కడ సమస్య ఉన్న సిబ్బందికి వాకీటాకీల ద్వారా సమాచారం వెంటనే వెళ్తుందని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు భిక్షపతి, మహేశ్, నరేందర్‌రెడ్డి, మల్లయ్య, మహేశ్, గణేశ్, ఎట్టమ్మ, బుజ్జి, రాంచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ సిబ్బంది వంటావార్పు



యాచారం: నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, పంచాయతీ సిబ్బంది



దౌల్తాబాద్: సమ్మెలో పాల్గొన్న కార్మికులు

యాచారం: ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.25వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేస్తు పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె సోమవారానికి ఐదో రోజుకు చేరుకుంది. మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది వంటావార్పు చేపట్టారు. పంచాయతీ సిబ్బందికి మద్దతుగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, జిల్లా కార్యదర్శి యాదయ్యగౌడ్, సీపీఐ మండల కార్యదర్శి సంజీవ, తాడిపర్తి సర్పంచ్ రమేష్, వివిధ గ్రామాల ఉప సర్పంచ్‌లు జగన్, మహేందర్, వెంకటేష్, నరేష్ సమ్మెలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె

దౌల్తాబాద్: పంచాయతీ కార్మికుల చేస్తున్న సమ్మె సోమవారం 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వేతనం రూ.19500కు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడి కుర్మని సాయిలు, కార్మికులు పాల్గొన్నారు.

దేవుని పడకల్‌లో కప్ప పండుగ



వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌లో సోమవారం గ్రామస్తులు కప్ప పండుగ నిర్వహించారు. కప్పను వేపాకు మండల మధ్య కట్టి బోనాలతో గ్రామ ప్రధాన కూడళ్ల మీదుగా ఊరేగింపు జరిపారు. వరుణదేవుడా కరుణించవా అంటూ మహిళల పాటలు పాడుతూ వేడుకున్నారు. వర్షాకాలం వచ్చి రెండు నెలలు అవుతున్నా ఇప్పటికీ సరైన వర్షాలు పడలేదన్నారు. నాటిన విత్తనాలు మొలకెత్తక భూమిలోనే కూరుకుపోయాయి. అంతేగాక ప్రస్తుతం ఉన్న పంటలకు సరిపోను నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, పశువులకు గ్రాసం కరువైందని, తాగునీరు దొరుకక మూగజీవాలు అల్లాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు కురవాలని వేడుకున్నారు.

విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల పిలుపు

ఆమనగల్లు: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఆమనగల్లు మండల ఎస్ఎఫ్ఐ కార్యదర్శి అరుణ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడీని నియంత్రించాలని అరుణ్ కోరారు.

బంద్‌కు సహకరించాలి..

తుర్కయంజాల్: ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం చొరవ తీసుకోవడం లేదని విమర్శించారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయండి



మొక్క నాటుతున్న శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రంతో పాటు, మైసిగండి గ్రామాల్లో సోమవారం పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. శ్రీనివాస్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కడ్తాల్‌లో పార్టీ నాయకులతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మొక్కలు నాటారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, నాయకులు జవహర్‌లాల్, హీరాసింగ్, రాంచందర్, రామకృష్ణ, కిషన్ ఉన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించండి

పార్టీ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మంచాల: గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలమైన శక్తిగా తయారుచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆరుట్ల గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకొని వచ్చిందన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించే విధంగా కార్యచరణ తీసుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేస్తున్న కృషిని ప్రజలకు తెలయజేయాలన్నారు. మారుమూల తండాల్లో కూడా నేడు.. రోడ్డు, రవాణా వ్యవస్థ ఉందంటే అది మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చొరవే అన్నారు. అనంతరం ఆరుట్ల గ్రామంలో చనిపోయిన బషీరుద్దీన్, నర్సింహారెడ్డి మృతదేహాలకు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు రాము, మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాషా, నాయకులు రఘుపతి, శేఖర్, జంగయ్య, వినోద్, ఐలయ్య, వెంకటేష్, జంగయ్య, శ్రీకాంత్, నిఖిల్, భాష, సాయిగౌడ్, మల్లేష్, సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.